క్లుప్తంగా

రైల్వే రిజర్వేషన్ పాత వేళలు పునరుద్ధరణ

పులివెందుల : రైల్వే టిక్కెట్ల రిజర్వేషన్ల కోసం పాత సమయాలను పునరుద్ధరించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రైల్వే అధికారులకు విన్నవించారు. సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ స్పందించి పాత వేళలను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రయాణీకుల సౌకర్యార్థం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు కౌంటర్ల పాత పద్ధతినే కొనసాగిస్తున్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌కు రైల్వే ప్రయాణీకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో నిరసనలు



గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న డిపో కార్మికులు

జమ్మలమడుగు : తమ డిమాండ్లను పరిష్కారం చేయాలంటూ ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి శివుడు మాట్లాడుతూ ఏపీపీటీడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కొంత కాలంగా నిలిచిపోయిన పదోన్నతులను వెంటనే కల్పించాలన్నారు. గ్యారేజీలో ఉన్న సమస్యలు, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ శేషన్న, వర్కింగ్ అధ్యక్షుడు ఓబుళరెడ్డి, గ్యారేజి కార్యదర్శి వలి, డిపో కార్మికులు పాల్గొన్నారు.

నేడు మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్డుదారులకు రేషన్ పంపిణీ



ప్రకాశ్‌నగర్ కాలనీలోని కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రకాశ్‌నగర్ కాలనీకి చెందిన కార్డుదారులకు ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు రేషన్ పంపిణీ చేశారు. గురువారం సాక్షిలో ప్రచురితమైన మా రేషన్ మాకు ఇవ్వండి కథనంకు అధికారులు స్పందించారు. కాలనీలోని కార్డుదారులకు ఎండియూ ఆపరేటర్ బియ్యం ఇవ్వకుండా వేరే కాలనీలో ఇచ్చారు. దీంతో కార్డు దారులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి అధికారులతో మొరపెట్టున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు, సంబంధిత డీలర్ స్పందించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీతో పాటు వీఆర్‌ఓ భారతి, డీలర్ సంయుక్తంగా కార్డుదారులకు వద్దకు వెళ్లి వేరే షాపు నుంచి రేషన్ తెప్పించి పంపిణీ చేశారు.

నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన కమిటీ సభ్యులు

వీరపునాయునిపల్లె : మహాజన సోషలిస్టు పార్టీ, మండల కమిటీ ఎన్నిక గురువారం స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ మాదిగ ఆధ్వర్యంలో జరిగింది. మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడిగా సంగాల రామయ్య మాదిగ, ఉపాధ్యక్షుడు పాలెం గంగాధర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి అడవిగాల్ల శ్రీనివాసులు మాదిగ, వర్కింగ్ ప్రసిడెంటు చెప్పలి ఈశ్వరయ్య మాదిగ, కార్యదర్శి మణికుమార్ మాదిగ, సహాయ కార్యదర్శి చిన్నఓబులేసు ఎంపికయ్యారు.

కడప స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా సుధాకర్

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. వెయిటింగ్‌లో వున్న డీఎస్పీ ఎన్. సుధాకర్‌ను కడప స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమించారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయన జిల్లాలో ఎస్ఐగా, సీఐగా, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా విధులను నిర్వహించారు. ఇటీవల అన్నమయ్య జిల్లా రాజంపేట డీఎస్పీగా పనిచేస్తూ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. అక్కడి నుంచి తాజాగా కడప జిల్లా పోలీసుశాఖ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమితులయ్యారు.

బాదుడే.. బాదుడు



పులివెందులలో సరఫరాకు సిద్ధంగా ఉన్న గ్యాస్ సిలిండర్లు

పులివెందుల రూరల్ : ప్రస్తుత కాలంలో వంట గ్యాస్ లేనిదే.. ఏ పని జరగదు. గతంలో కట్టెల పొయ్యి మీద వంటలు చేసుకునేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. గ్రామాల్లో సైతం వంట గ్యాస్ లేనిదే ఏ పని జరగడంలేదు. అలాంటి వంట గ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం బాదుడే బాదుడు కొనసాగిస్తోంది. ప్రతినెలా మొదటి వారంలో చమురు సంస్థలు గ్యాస్ ధరలను పెంచుతుంటాయి. ఈ నేపథ్యంలో తాజాగా వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50లు అదనపు భారం మోపారు. గతంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.860లు ఉండగా.. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రూ.50లు పెంచడంతో గ్యాస్ సిలిండర్ ధర రూ.911లకు చేరింది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గ్యాస్ ధర కూడా పెరగడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెంచిన గ్యాస్ ధరలతో జిల్లా వ్యాప్తంగా రూ.20 కోట్ల భారం పడుతుంది. సిలిండర్ రవాణా చార్జీలు అంటూ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అదనంగా రూ.60 వసూలు చేస్తున్నారు. దీంతో గ్యాస్ వినియోగదారులపై మరింత భారం పడుతుందని వారు వాపోతున్నారు.

సామాన్యులు గ్యాస్ కొనలేరు



కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.50 పెంచడంతో గ్యాస్ కొనాలంటేనే భయమేస్తుంది. స్త్రీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామంటూనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపైన పెనుభారం మోపుతున్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు మార్కెట్‌లో భగ్గుమంటున్నాయి. దీనికి తోడు గ్యాస్ ధర పెంచడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి ఏర్పడింది.

– రమాదేవి, గృహిణి, పులివెందుల

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి. లేకపోతే సామాన్యులు బతకలేని పరిస్థితి. ఎన్నికల సమయంలో పేద ప్రజలకు అనుకూలంగా అన్ని నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని చెప్పారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారే తప్ప ధరలను మాత్రం తగ్గించడం లేదు.

– మహేశ్వరి,స్థానికురాలు, పులివెందుల

హోమియోలో అన్ని రకాల చికిత్సలు



వికలాంగుల కాలనీలో వైద్య సేవలు అందిస్తున్న హోమియో వైద్యులు షాకీర్ హుసేన్

కమలాపురం : హోమియో వైద్యంలో అన్ని రకాల రోగాలకు వైద్య చికిత్సలు ఉన్నాయని ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యులు హుసేన్ ఆధ్వర్యంలో హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫెడ్రిక్ జయంతి, ప్రపంచ హోమియో దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వికలాంగుల కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన 55 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ క్రిస్టియన్ ఫెడ్రిక్ శామ్యూల్ హనిమన్ 1755 ఏప్రిల్ 10న జన్మించారన్నారు. 14 భాషల్లో ప్రావీణ్యం పొందిన ఈయన అల్లోపతి డాక్టర్ అయి కూడా ఆ వైద్య విధానం పట్ల విరక్తి చెంది 1796లో హోమియో పతి వైద్యా విధానంను కనుగొన్నారని గుర్తు చేశారు. ఈయన కనబెట్టిన హోమియో వైద్య విధానం ద్వారా అనేక రోగాలకు చికిత్సలు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలకు హోమియోలో అత్యుత్తమ వైద్యం అందుతోందన్నారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా రోగులకు మంచి హోమియో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. కమలాపురంలోని ప్రభుత్వ వైద్యశాలలో మంగళ, గురు, శని వారాలలో తాను అందుబాటులో ఉండి హోమియో వైద్యసేవలు అందిస్తానని ఆయన తెలిపారు. రోగులు హోమియో వైద్య సేవలు పొందాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హోమియో వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ ఏఓ ప్రతిభా అవార్డుకు ఎంపిక



ఏఓ రవికుమార్

వేంపల్లె : ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పెనుగొండ రవికుమార్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు ఉపాధ్యాయ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య వెల్లడించారు. డాక్టర్ రవికుమార్ 12 ఏళ్ల నుంచి ట్రిపుల్‌ఐటీ అభివృద్ధికి పాటుపడుతూ జపాన్ దేశంలోని ఏఐజెడ్‌యూ యూనివర్సిటీలో పరిశోధనలు చేశారన్నారు. సాహిత్యం, విద్య, సామాజిక సేవ రంగంలో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 13న గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ పురస్కార అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

కస్తూర్బా పాఠశాలలో అడ్మిషన్లపై అవగాహన



వేల్పులలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అడ్మిషన్ల కరపత్రాలతో సిబ్బంది, విద్యార్థులు

వేముల : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాల గురించి పాఠశాల సిబ్బంది ప్రభుత్వ పాఠశాలల వద్దకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని వేల్పుల, కసనపల్లె, మోట్నూతలపల్లె గ్రామాల్లో పాఠశాల ప్రిన్సిపాల్ శారద ఆధ్వర్యంలో సిబ్బంది పాఠశాలల వద్దకు వెళ్లి విద్యార్థులకు ప్రవేశాల గురించి వివరించారు. కస్తూర్బా పాఠశాలలో బాలికలకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని పాఠశాలలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. బడిబయట పిల్లలు, తల్లిదండ్రులులేని పిల్లలను, వలస వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలతోపాటు ఎస్సీ, ఎస్టీ, నిరుపేద విద్యార్థులను గుర్తించి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల కొరకు ఆన్‌లైన్ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను విద్యార్థులకు అందించి వారిలో అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఆయా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గండికోటకు యునెస్కో గుర్తింపు కోసం కృషి



గండికోట లోయ వద్ద పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆది

జమ్మలమడుగు : ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటకు యునెస్కో గుర్తింపు కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణరెడ్డి తెలిపారు. గురువారం గండికోటలో ఆయన టూరిజం అధికారి కాంతారావు, ఆర్కియాలజి అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. యునెస్కో గుర్తింపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేస్తే గండికోట అద్భుతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గండికోటలో మొత్తం 160 నివాసలు ఉండగా అందులో 120 మంది నివాసం ఉన్నారు. వారందరిని గౌరవప్రధంగా బయటికి పంపించేవిధంగా కృషి చేస్తానన్నారు.

పౌష్టికాహారంతోనే పిల్లల్లో ఆరోగ్యం



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా

వేముల : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా తెలిపారు. పోషణ పక్వాడ కార్యక్రమం ఈనెల 9వ తేదీ నుంచి 22వ తేదీవరకు అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించనున్నారు. గురువారం మండలంలోని పెర్నపాడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, కిశోర బాలికలకు సమావేశం నిర్వహించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం పిల్లల ఆరోగ్య స్థితిని బాగుంటుందన్నారు. పిల్లల యొక్క పోషణ స్థితి, ఊబకాయం గురించి అవగాహన కల్పించామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం తమకు మార్చి నెల వేతనాలు తక్షణం చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి. శాంతమ్మ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఇదెక్కడ సబ్సిడీ



ప్రభుత్వం సబ్సిడీతో అందించే పవర్ స్ప్రేయర్

సింహాద్రిపురం : ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు పవర్ స్ప్రేయర్లు అందిస్తోందని, కావాల్సిన రైతులు ఆయా ఆర్ఎస్‌కే కేంద్రాలలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శివమోహన్ రెడ్డి తెలిపారు. గురువారం రైతులు ఆర్ఎస్‌కే కేంద్రాల వద్దకు వెళ్లి సిబ్బందిని కలిసి ప్రభుత్వం సబ్సిడీతో అందించే హోండా పోర్ స్ట్రోక్ పవర్ స్ప్రేయర్ ధర అడగగా.. వారు పవర్ స్ప్రేయర్ ధర రూ.16వేలు, బ్యాటరీ స్ప్రే రూ.3500లు అని చెప్పడంతో రైతులు అవాక్కయ్యారు. ఇదే పవర్ స్ప్రేయర్ ధర బయట మార్కెట్‌లో రూ.15వేలు, బ్యాటరీ స్ప్రే రూ.2,800ల నుంచి రూ.3,200లకు దొరుకుతోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పవర్ స్ప్రేయర్‌కు రూ.1000లు, బ్యాటరీ స్ప్రేర్‌కు రూ.500లు ఎక్కువ చెల్లించాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ ధరలను చూసిన రైతులు కూటమి ప్రభుత్వం సబ్సిడీ ఏ మేరకు ఇస్తుందో ఇట్టే అర్థమవుతోందని నిరుత్సాహపడి వెనుతిరిగి పోతున్నారు.

బయట ఫుడ్ పిల్లలకు పెట్టవద్దు

కొండాపురం : ఫాస్ట్‌ఫుడ్ తీసుకుంటే ఆరోగ్యానికి ఇబ్బందులు తప్పవని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. గురువారం మండలంలోని తాళ్లప్రొద్దుటూరు, బుక్కపట్నం కాలనీల్లో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె అవగాహన కల్పించి మాట్లాడారు. బయట ఫుడ్ నూడిల్స్, ఎగ్‌రైస్, గోబిరైస్ వంటి ఫాస్ట్‌ఫుడ్‌లల్లో వెగిగర్, టెస్టింగ్ లాస్ట్ కలపడంతో ఆరోగ్య సమస్యలు వస్తాయని వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలన్నారు. సంరక్షణ పౌష్టికాహారం కూడిన ఆహారమే పిల్లలకు అలవాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సాయితేజ, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

పాల ప్యాకెట్‌తో దాహం తీర్చుకున్న వానరం



పులివెందుల రూరల్ : పట్టణంలో రోజు రోజుకు పెరుగుతున్న ఎండ వేడిమికి ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. మూగజీవాలు ఎండ వేడిమితో గొంతు తడుపుకునేందుకు నీటి కోసం ఆగచాట్లు పడుతున్నాయి. గురువారం పట్టణంలోని ఓ జ్యూస్ సెంటర్‌లో వానరం పాల ప్యాకెట్ తీసుకుని దాహం తీర్చుకుంది. కడుపులో చల్లగా ఉండటంతో ఆనందంగా మూతి తుడుచుకుంటూ వెళ్లింది.

గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై అలసత్వం వద్దు

వేంపల్లె : గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై వైద్య శాఖ అధికారులు అలసత్వం చూపకుండా వైద్య సేవలు అందించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని పాములూరు గ్రామంలో ఉన్న విలేజ్ హెల్త్ సెంటర్‌ను ఆయన పరిశీలించి ప్రజలతో సమావేశం మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ దేశ సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, అంత్యోదయ సిద్ధాంతం అంటే సమాజంలోని చిట్ట చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడమే ధ్యేయంగా మోదీ పనిచేస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు సర్పంచ్‌ల ఖాతాల్లో వేయడం జరుగుతుందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు లబ్ధి పొందాలన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన ద్వారా ఇల్లు, కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు ప్రతి ఏడాది పెట్టుబడి సాయం కింద రూ.6 వేలు, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన బ్యాంకింగ్ సేవలకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా ఆర్థిక చేరికను పెంచడం, మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశీయ తయారీ, పెట్టుబడులను ప్రోత్సహించడం, ఆయుష్మాన్ భారత్ ద్వారా బలహీన వర్గాల ప్రజలకు ఆరోగ్య భీమా కవరేజ్ చేయడం,వంటి అనేక కార్యక్రమాలతో దేశాన్ని ముందుకు నడిపిస్తున్న ధీరుడు పీఎం మోడీ అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మునగల చంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలకు జాప్యమేల..!

కొండాపురం : మండలంలోని చౌటిపల్లె పునరవాస కేంద్రం సమీపంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై ఆరోపణలపై కేసులు నమోదైనా చర్యలో జాప్యం ఎందుకని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాది కాలంలో కొండాపురంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భర్త అక్కడి సిబ్బందిపై లైంగిక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నిజనిర్ధారణలో వాస్తవమని తెలిసి ప్రిన్సిపాల్, ఆమె భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఒక ప్రిన్సిపాల్‌పైన కేసు నమోదైనా గురుకుల పాఠశాలలో కొనసాగించడం దేనికి నిదర్శనం అని ఆయన ప్రశ్నించారు. ఆమెపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొడులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

చెత్తను తొలగించండి సారూ..



వడ్డెరవీధిలో చెత్తాచెదారాలలో తిరుగుతున్న ఆవు

వేంపల్లె : వేంపల్లె గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారయింది. ఏ వీధి, ఏ కాలనీలో చూసినా చెత్తాచెదారాలతో నిండి ఉన్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది అంతంత మాత్రంగానే ఉండడంతో డ్రైనేజీ, పారిశుద్ధ్య వ్యవస్థలు అధ్వానంగా తయారయ్యాయి. వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో సుమారు 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. పట్టణంలోని వడ్డర వీధి, గరుగు వీధి, చైతన్యనగర్ వీధి, ఉషాకిరణ్ స్కూల్ వీధి, శ్రీరామనగర్, గాండ్లవీధి, కాపువీధి తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలో చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. అయితే గత నెలరోజుల క్రితం గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ఈవో వెంకటసుబ్బారెడ్డి సస్పెండ్ కావడంతో గ్రామపంచాయతీపై దృష్టి సాధించేవారు కరువయ్యారు. అటు అధికార పార్టీ నాయకులు సమర్థవంతమైన ఈవోను తీసుకురావడంలో విఫలమయ్యారు. దీంతో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది పట్టించుకున్న పాపానపోలేదు. వడ్డెర వీధిలోని శ్రీకృష్ణ ఆలయం వద్ద గత నెల రోజులుగా పారిశుద్ధ్యం తొలగించకపోవడంతో అక్కడ చెత్తాచెదారాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ ఈఓను నియమించేందుకు కృషి చేయాలన్నారు. కింది స్థాయి సిబ్బందికి చెప్పి చేయించే అధికారులు లేకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. గత నాలుగు నెలలుగా పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడంతో ప్రజలు వారి గోడు వినిపించుకున్నా సిబ్బంది వినే పరిస్థితిలో లేరు. నాలుగు రోజుల క్రితం పులివెందల డీఎల్‌పీఓ రమాదేవి సిబ్బందిని పిలిపించి మీ జీతాలను త్వరలో చెల్లిస్తామని హామీ ఇచ్చినా కూడా సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇక్కడ పరిస్థితులు మెరుగుపడాలంటే కలెక్టర్ చొరవ తీసుకోవాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ జగన్ వ్యాఖ్యలు వక్రీకరించారు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు

వల్లూరు (చెన్నూరు) : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా రాప్తాడు పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలను వక్రీకరించడం తగదని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతలు తెలిపారు. గురువారం వారు చెన్నూరులో విలేకరులతో మాట్లాడారు. అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త హత్యకు గురయ్యాడని తెలిసి జరిగిన సంఘటనలో పోలీసు వారు అన్యాయం చేశారని, ఈ ఘటనలో పోలీసుల పాత్ర ఉందని అక్కడి ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఇందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ విధంగా అన్యాయానికి పాల్పడటం సరికాదని, కక్షలను పెంచిపోషించే విధంగా వ్యవహరించకూడదన్నారు. అలాంటి తప్పు చేస్తే ఎంతటి వారైనా రాజ్యాంగ స్ఫూర్తితో వారి బట్టలు అనగా వారి పోలీస్ డ్రెస్సును వారికి కాకుండా చేస్తామని హితబోధ చేశారన్నారు. తప్పుగా అర్థం చేసుకున్న అక్కడి రామగిరి మండలం పోలీస్ అధికారి తన స్థాయిని మరిచి మాట్లాడటం విస్మయం కలిగిస్తుందన్నారు. అలాగే పోలీస్ సంఘాల పెద్దలు కూడా తానా అంటే తందానా అనే విధంగా మాట్లాడటం చర్చనీయాంశమైందన్నారు. సమావేశంలో మండల కో ఆప్షన్ సభ్యులు వారీస్, నియోజకవర్గ మైనార్టీ ఇన్‌చార్జి అన్వర్, చెన్నూరు గ్రామపంచాయతీ వైస్ ప్రెసిడెంట్ జుమ్మన్, చెన్నూరు మండల మైనార్టీసెల్ అధ్యక్షుడు హస్రత్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదోళ్ల సొంతింటిపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం



నిరాహార దీక్ష చేస్తున్న సీపీఐ నాయకులు

జమ్మలమడుగు : పేదవాడి సొంతింటికల గురించి గొప్పగా చెప్పిన కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇళ్లు లేని వారికి ఇంటి స్థలాలను వెంటనే ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలంటూ ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని సీపీఐ నాయకుడు ప్రసాద్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలంను ఇళ్లులేని నిరుపేదలకు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించారు. అధికారంలోనికి వచ్చిన ఎన్‌డీఏ కూటమి ఆ హామీని ఇంతవరకు అమలు చేయలేకపోయిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.